క్లుప్తంగా

చెట్ల కొమ్మలు తరలించరా..?



రోడ్డుపైనే చెట్ల కొమ్మలు

దహెగాం: విద్యుత్ తీగలపైకి చెట్ల కొమ్మలు విస్తరించడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు శనివారం మండల కేంద్రంలో వాటిని తొలగించారు. తొలగించిన కొమ్మలను తరలించకుండా అక్కడే వదిలేశారు. దీంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల పూజలు



పూజలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు ఆదివారం శివలింగాపూర్ భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు ఆటోల్లో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆటోలకు పూజలు చేశారు. ఆలయంలో మొక్కలు చెల్లించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు వన భోజనాలు చేశారు. ఏటా ఆలయంలో ఆటో డ్రైవర్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, భక్తులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ తల్లికి బోనాల సమర్పణ



బోనాలతో మహిళలు

ఆసిఫాబాద్: కట్ట మైసమ్మ తల్లి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో భక్తిశ్రద్ధలతో భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు తలపై ఎత్తుకొని పట్టణంలోని లాల్‌బహదూర్ మార్కెట్ నుంచి ఆర్బీరోడ్ కాలనీ వీధుల నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కట్ట మైసమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, సతీమణి కోనేరు రుక్మిణి దేవి మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్: మండలంలోని భట్‌పల్లి గ్రామంలో ఆదివారం మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోచయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, సంతోష్, మిలింద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

నార్నూర్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండలంలోని భీంపూర్‌లో బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని సూచించారు. నాయకులు యునాస్ అక్బని, మేస్రం హనుమంతరావు, ఎంపీపీ కనక మోతుబాయి, ఆడియో సురేశ్, ఊర్వేత రూప్‌దేవ్, దుర్గే, కాంబ్లే ఉదయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల/కళాశాలలో వివిధ సబ్జెక్టులు తాత్కాలిక పద్ధతిలో బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో గోపిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో గణితం, సైన్స్, సోషల్, హిందీ, ఇంగ్లిష్, కళాశాలలో తెలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. బీఈడీ, పీజీ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 29లోగా జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 30న టీచింగ్ డెమో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 83090 07172 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు కరువు

- ప్రమాదాల బారిన పడుతున్న పశువులు
- నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



కొండపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు(ఫైల్)

పెంచికల్‌పేట్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు లేక పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయటానికి విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి మూగజీవాల ప్రాణాలు పోతున్నాయి.

మండలంలో..

మండలంలో గత ఏడాది కాలంగా పోతెపల్లి, కొండపల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో 5 పశువులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. పోతెపల్లి గ్రామంలో మేతకు వెళ్లిన అకిరెడ్డి వెంకటేశ్ అనే రైతుకు చెందిన ఎద్దు, కొండపల్లి గ్రామంలో బొల్లబోయిన శ్రీదేవి అనే రైతుకు చెందిన ఆవు, పెంచికల్‌పేట్ గ్రామంలో చెందిన చప్పిడే మధుకర్, దాసరి శంకర్, సామెర రాములకు చెందిన పశువులు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మేతకు వెళ్లిన పశువులు ఎలాంటి కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ రక్షణగా కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంచెలు ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు లేకపోవడంతో మేతకు వెళ్లిన పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసే సమయంలోనే కంచెలు కూడా నిర్మించాలి. విద్యుత్ ప్రమాదాలు అరికట్టడానికి జాగ్రత్తలు తీసుకోవాలి.

\- వెంకటేష్, గొంట్లపేట్

ప్రమాదాలు జరగకుండా చర్యలు

గతంలో ప్రమాదాలు జరిగి పశువులు మృత్యువాత పడ్డాయి. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రక్షణ చర్యలు తీసుకున్నాం. విద్యుదాఘాతంతో మృతి చెందిన పశువులకు పరిహారం అందించడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

\- అంజల్ కమార్, ఏఈ, పెంచికల్‌పేట్

ఇక ఆ గ్రామాలకు తిప్పలే..!



పూర్తికాని వంతెన పనులు

- రెండేళ్లుగా నిలిచిన వంతెన పనులు
- చిన్నపాటి వర్షాలకే వాగులోకి చేరిన వరద
- ఉప్పొంగి ప్రవహిస్తే రాకపోకలు బంద్

కెరమెరి: వానాకాలం ప్రారంభమైంది. గత మూడు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని వాగుల్లో నీరు ప్రవహిస్తుంది. ఏటా భారీ వర్షాలు పడితే వాగులు ఉప్పొంగి ప్రవహించి వంతెనలు లేని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అనార్‌పల్లి వంతెన పనులు నిలిచిపోవడంతో మండలంలోని కరంజివాడ, బోరిలాల్‌గూడ గ్రామ పంచాయతీలకు చెందిన గోండ్‌గూడ, ఆంద్‌గూడ, పెద్ద కరంజివాడ, చిన్న కరంజివాడ, బోరిలాల్‌గూడ, కొలాంగూడ, జన్కాపూర్, ఇంద్రానగర్, లచ్చునాయక్‌తాండ, శంకర్‌లొద్ది తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఆయా గ్రామాల్లో సుమారు 600లకు పైగా కుటుంబాలు, 3000లకు పైగా జనాభా ఉంది. వారంతా ఏ చిన్న వస్తువు కావాలన్నా వారు కెరమెరికి వెళ్లక తప్పదు. ఎన్నో ఏళ్లుగా పడుతున్న కష్టాలకు చెక్ పెట్టేందుకు గత సంవత్సరం వంతెన మంజూరు చేసినా, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పూర్తి కాలేదు.

వానలతో భయం..

ప్రజల రవాణా సౌకర్యార్థం వాగులు ఉన్న చోట ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం వంతెనలు మంజూరు చేస్తుంటే అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం మూలంగా అవి నిర్మాణానికి నోచుకోవడం లేదు. మండలంలోని అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పీఎంజీఎస్‌వై పథకం కింద గత సంవత్సరం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. అయినప్పటికీ నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది.

వానాకాలం వస్తే భయమే



వానాకాలం వచ్చిందంటే చాలా ఆందోళనగా ఉంటుంది. అనార్‌పల్లి వాగు ఎగువ ప్రాంతంలో ఎక్కడా వర్షం కురిసినా వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. రోగులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా వంతెన పనులు పూర్తి చేయాలి.

\- కుమురం బొజ్జు, గ్రామపటేల్, కరంజివాడ

భారీ వర్షం.. రాకపోకలకు అంతరాయం



ఖమానలో నిలిచిన రాకపోకలు

వాంకిడి: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో ఒర్రెలు ఉప్పొంగాయి. పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై లోలెవల్ వంతెనలు ఉండటంతో వరద ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఏళ్లుగా గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు సమాజిక మాధ్యమాల్లో అసహనం వ్యక్తం చేశారు.

పొలం పనుల్లో రైతన్న బిజీ





ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఆదివారం జిల్లాలో రైతులు ఎక్కడ చూసిన పత్తి, పెసర, కంది, కూరగాయల విత్తనాలు నాటుతూ బిజీగా కన్పించారు.

'పాడి కౌశిక్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలి'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని డబ్బా గ్రామంలో ఆదివారం ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు.

తులసిచందుపై మతోన్మాదుల బెదిరింపులు సరికాదు

ఆసిఫాబాద్: స్వతంత్ర జర్నలిస్ట్, సామాజిక విశ్లేషకురాలు తులసిచందును చంపుతామని బెదిరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదుల చర్యలను సీఐటీయూ నాయకుడు ఎం.ఆనంద్ ఒక ప్రకటనలో ఖండించారు. స్వతంత్ర జర్నలిస్టుగా మతోన్మాదం, మనువాద ఆగడాలు, అరాచకాలను ప్రశ్నిస్తూ, దేశంలో శాంతి, మతసామరస్యాలను పెంపొందించాలనే సంకల్పంతో అనేక సామాజిక మాధ్యమాల్లో విశ్లేషణలు చేస్తున్న తులసిచందుపై బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

'పఠనోత్సవాన్ని' నిర్వహించాలి

కెరమెరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఎస్‌ఎంసీ సభ్యులను ఆహ్వానించి కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. కార్యక్రమం జూలై 31 వరకు కొనసాగుతుందని, ప్రతీరోజు ఒక పీరియడ్ ఇందుకు కేటాయించాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఆర్‌టీ పరీక్ష



పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న డీటీడీవో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నిర్వహించిన గిరిజన శాఖ సీఆర్‌టీ (ఎస్‌జీటీ) అర్హత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు డీటీడీవో మణెమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 1198 మంది అభ్యర్థులకు 1123 మంది హాజరు కాగా, 75 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాలను డీటీడీవో పర్యవేక్షించారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 'దాన్‌టు డస్క్' కార్యక్రమంలో భాగంగా గవర్నర్ కొండ చంద్రశేఖర్, కొడిప్యాక విద్యాసాగర్, క్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కొడిప్యాక రవీందర్, కార్యదర్శి అభిలాశ్, కోశాధికారి గుండ సాయి, చిలువేరు వెంకన్న, గుండ బాలేశ్, పిన్న వివేక్, తంగడిపెల్లి రమేశ్, కొలిప్యాక వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.లక్ష సాయానికి ఎదురుచూపులు

- మండలంలో 535 దరఖాస్తులు
- పరిశీలన పూర్తి చేసిన అధికారులు



దరఖాస్తులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కౌటాల: వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తులు, చేతివృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించింది. ఈనేపథ్యంలో బీసీలు అష్టకష్టాలు పడి దరఖాస్తులు చేసుకొని ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పూర్తిగా చేతివృత్తిదారులకే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుండగా తొలి విడుతలో 15 బీసీ కులాలకు అవకాశం కల్పించింది. దీంతో కొద్ది రోజుల నుంచి బీసీలు అవసరమైన కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద రాత్రి, పగలు పడిగాపులు కాశారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులకు గడువు త్వరగా ముగియడంతో ధ్రువీకరణ పత్రాలు అందని వారు నిరాశ చెందారు.

దరఖాస్తుల పరిశీలన

బీసీ కులవృత్తిదారుల కోసం ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష సాయానికి మండలంలో మొత్తం 535 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, 17 గ్రామపంచాయతీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. మూడు గ్రామపంచాయతీల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను ఈనెల 23న ఎంపీడీవో నస్రుల్లాఖాన్, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. దరఖాస్తుదారుల కులం, ఆదాయం, నివాసం, కులవృత్తి వివరాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 535 దరఖాస్తులు రాగా, అందులో 322 కులవృత్తి దారులు దరఖాస్తు చేసుకోగా, 213 మంది కులవృత్తులు చేయని వారు దరఖాస్తులు చేసినట్లు అధికారులు గుర్తించారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని వారు తెలిపారు.

'బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి'



గోలేటిలో పోస్టర్లు అందజేస్తున్న శ్రీకాంత్

రెబ్బెన: బీజేపీ 9ఏళ్ల పాలనలోనే దేశం అభివృద్ధి సాధించిందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి జోత్రిగల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని గోలేటిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు, దుకాణదారులకు పోస్టర్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర ఆత్మారాం నాయక్, క్రిష్ణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోట్నాక విజయ్, మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలోని ప్రతీ గ్రామంలో గడపగడపకు తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి జోత్రిగల శ్రీకాంత్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చేర్ల మురళీధర్, కోట్నాక విజయ్, దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాం నాయక్, కొంగ సత్యనారాయణ, కృష్ణకుమారి, నాయకులు వెంకట్‌నాయక్, గణపతి, జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గోవులను వధించొద్దు'



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

ఆసిఫాబాద్: దేశ చట్టాలను గౌరవిస్తూ బక్రీద్‌కు బలిచ్చే జంతువుల్లో గోవులు ఉండకుండా జాగ్రత్త పడాలని ముస్లిం పెద్దలు సూచించారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో ఆదివారం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, జామియా మసీదు అధ్యక్షుడు అబుల్ ఫయాజ్, ఉస్మానియా మసీదు అధ్యక్షుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, ఈద్గా కమిటీ అధ్యక్షుడు అమానుల్లా పర్వేజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్, అబ్దుల్లా మాట్లాడారు. ఆవులను వధించకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గోరక్ష పేరుతో జరిగే దాడులను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 29న ఈద్గా వద్ద ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు.

చిత్తడిగా మారిన అంతర్గత రోడ్లు



చిత్తడిగా మారిన రోడ్డు

దహెగాం: వర్షాకాలం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని రోడ్లు, కల్వాడ వైపు వెళ్లే రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల కారణంగా బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి బురదగా మారిన రోడ్లపై కంకర, మట్టి పోయాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారి ఆలయంలో ఆషాఢమాస పూజలు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.